

## పోలీస్ రాజ్యం!





డిమాండ్ల పరిష్కారం కోసం శుక్రవారం నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన నిరుద్యోగులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు కాళ్లు, చేతులు పట్టి బలవంతంగా వాహనాల వైపు ఈడ్చుకెళ్తున్న పోలీసులు

# నిరుద్యోగులపై సర్కారు ఉక్కుపాదం

**'నిరుద్యోగ మార్చ్'పై పోలీస్ జులుం • టీజీపీఎస్సీ ఆఫీస్ వద్ద దౌర్జన్యకాండ • నిరుద్యోగ యువతపై కర్కశత్వం • సంబంధంలేనోళ్లపైనా ఖాకీల ప్రతాపం**

- బాధితుల్లో రైతులు, లాయర్లు, చిరుద్యోగులు, రిపోర్టర్లు, మహిళలు
- మెట్రోలోనూ అరెస్టుల పరంపర
- ఐడీకార్డులు ఉన్నా వదలని పోలీసులు
- రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధకాండ

నిరుద్యోగులు ఎత్తిన పిడికిళ్లపై లాఠీలు ఝుళిపించారు. 'వుయ్ వాంట్ జస్టిస్' అంటున్న గొంతులు మూగబోయేలా పిడిగుద్దులు గుద్దారు. 'న్యాయం చేయండి' అంటూ రోడ్డెక్కిన నిరుద్యోగులను ఈడ్చి పడేశారు. 'న్యాయం జరిగేంత వరకు కదలం' అని భీష్మించిన నిరుద్యోగుల రక్తం కండ్లచూశారు. కనికరం లేకుండా రెక్కలు పట్టి ఈడ్చేశారు. కన్నీళ్లతో వేడుకుంటున్నా, కాళ్లతో తన్నుకుంటూ మెడలు పట్టి గెంటేశారు. ఒక్కొక్కరినీ నలుగురైదుగురు పోలీసులు చుట్టుముట్టి.. ఎత్తుకొని వ్యాన్లల్లో విసిరిపడేశారు. ఎక్కడికక్కడ నిర్బంధకాండను ప్రదర్శించారు. తమ డిమాండ్ల సాధన కోసం నిరుద్యోగులు శుక్రవారం చేపట్టిన నిరుద్యోగ మార్చ్‌పై పోలీసుల దౌర్జన్యానికి ఇవే నిదర్శనాలు. అంతటి అణచివేతను తిప్పికొడుతూ టీజీపీఎస్సీ ముట్టడిని ఎట్టకేలకు నిరుద్యోగ యువత విజయవంతం చేసింది.

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ రాజ్యం విషపు కోరలు విప్పింది. అన్యాయానికి గురైన నిరుద్యోగులపై పోలీసుల దౌర్జన్యకాండ కొనసాగింది. తమకు న్యాయం చేయాలని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి ఇచ్చిన పిలుపును అణచివేసేందుకు పోలీసులు జులుం ప్రదర్శించారు. చివరకు పోలీసు కుట్రలను ఛేదించుకుంటూ నిరుద్యోగి విజయం సాధించాడు. తన డిమాండ్లను ఎలుగెత్తి చాటాడు. ఈ క్రమంలో పోలీసులు సామాన్యులపైనా కర్రపెత్తనం చూపారు. నిరుద్యోగులను అణచివేసే కుట్రలో భాగంగా టీజీపీఎస్సీ ముట్టడికి సంబంధం లేనోళ్లనూ వ్యాన్లలో ఎక్కించి, పోలీసు స్టేషన్లకు తరలించారు. బాధితుల్లో రైతులు, లాయర్లు, చిరుద్యోగులు, జర్నలిస్టులు, మహిళలు, రోడ్డుపై కలిసి వెళ్లే భార్యాభర్తలు ఉన్నారు. మెట్రో రైళ్లలో కనిపించిన 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులను సివిల్ డ్రెస్సుల్లో వచ్చిన పోలీసులు ఎక్కడిక్కడే అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులమని చెప్పి, కాలేజీ ఐడీ కార్డులు చూపినా పోలీసులు కనికరించలేదు. అరెస్టు చేసి, స్టేషన్లకు పంపారు. అసెంబ్లీ నుంచి నాంపల్లి వైపు నడుచుకుంటూ వెళ్తున్న వారందరినీ అడ్డగించి, వివరాలు తెలుసుకొని, అరెస్టు చేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. శుక్రవారం రోజు నాంపల్లి వైపు రావడమే పాపమన్నట్టు పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నదని బాధితులు మండిపడుతున్నారు.



బీఆర్ఎస్ నాయకులను బలవంతంగా వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

## నాంపల్లిల్లో అప్రకటిత కర్ఫ్యూ

**హైదరాబాద్** నగరంలో శుక్రవారం ఉద్యోగార్థులపై పోలీసులు విరుచుకుపడ్డారు. టీజీపీఎస్సీ ముట్టడిని అడ్డుకునేందుకు దమనకాండ సాగించారు. నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద అప్రకటిత కర్ఫ్యూ అమలు చేశారు. ముట్టడికి తరలివచ్చిన వారిపై విరుచుకుపడి అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఉదయం నుంచి హైదరాబాద్‌లోని ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక పికెట్లు వేసి నిరుద్యోగ యువత నాంపల్లి వైపు వెళ్లకుండా కాపుకాశారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద ప్రత్యేక పికెట్లు నిర్వహించారు. ఉద్యోగార్థులు ఎక్కువగా నివాసముండే ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్, చిక్కడపల్లి, అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి ఎవరూ బయటకు రాకుండా కట్టడి చేశారు. నగర నలుమూలాల నుంచీ నాంపల్లి వైపు యువత తరలివెళ్లకుండా వేలాది మంది పోలీసులు మోహరించారు. నాంపల్లి, మొజాంజాహి మార్కెట్, గోషామహల్ ఇలా నలుదిక్కులా బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు.

**వృషణాలు పిసికిన పోలీసులు**

'మేం చెప్పినట్టు వినకుంటే ఎక్కడైనా (ప్రైవేట్ పార్ట్స్) పట్టుకుంటం, దేన్నీ లెక్క చెయ్యం' అంటూ టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద యువతపై పోలీసులు బెదిరింపులకు దిగిన వీడియోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టాయి. బలవంతంగా ఓ యువకుడి వృషణాలు పట్టుకొని పోలీసులు లాక్కెళ్తుండగా 'ఆగండాగండి' అని ఆ యువకుడు అరుస్తూ పోలీసులను ప్రాధేయపడిన దృశ్యాలు ఆ వీడియో ద్వారా బయటపడ్డాయి.

**• కాళ్లు పట్టుకోమంటరా?**



ఓ వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుకుంటూ వెళ్తుండగా 20 మంది పోలీసులు అతన్ని బలవంతంగా లాక్కెళ్లి వాహనం ఎక్కించారు. ఫోన్ గుంజుకున్నారు. ధర్నాతో తనకు సంబంధం లేదని ఓ ఎస్సై కాళ్లు పట్టుకున్నా వదలకుండా స్టేషన్‌కు తరలించారు.

**• దంపతులపై పోలీస్ జులుం**



రోడ్డుపై వెళ్తున్న భార్యాభర్తలపైనా పోలీసులు జులుం ప్రదర్శించారు. 'మేము ధర్నాకు రాలేదని చెప్పినా వినడం లేదు. మా ఫోన్ తీసుకున్నరు. ఎట్లా తీసుకుంటారు సార్? మమ్మల్ని ఎట్లా పట్టుకొస్తారు సార్ మీరు?' అంటూ ఆ దంపతులు పోలీసులను నిలదీశారు.

**• నేను రైతును.. ఎక్కడికి తోల్కపోతున్నరు**



అటుగా వెళ్తున్న ఓ రైతును పోలీసులు మూకుమ్మడిగా గుంజుకపోయి వ్యాన్‌లోకి ఎక్కించారు. 'నా కొడుకుది కార్యక్రమం ఉన్నది. అందుకే వచ్చిన సార్' అని చెప్పినా బస్సులోకి నెట్టేశారు. 'నన్ను ఎక్కడికి తోల్కపోతున్నరు చెప్పండ్రిసార్' అని బతిలాడినా వినలేదు.

**• జర్నలిస్టులపైనా అత్యుత్సాహం**



బీఆర్ఎస్వీ ఆందోళన తర్వాత బీజేవైఎం కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన టీవీ9 జర్నలిస్టును 10 మంది పోలీసులు చుట్టుముట్టారు. అతన్ని అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఆఖరికి ఐడీ కార్డు చూపించాక వదిలేశారు.

**• నేను అడ్వకేట్‌ను.. ఎలా అరెస్టు చేస్తారు?**



'నేను అడ్వకేట్‌ను. కోర్టుకుపోతున్నా. ఇదిగో ఐడీకార్డు. నా గల్లా పట్టుకొని ఎలా గుంజుకుపోతారు?' అని తన అక్రమ అరెస్టును నిరసిస్తూ ఓ అడ్వకేట్ పోలీసులను నిలదీశారు. ఆయన వాదనలేమీ వినకుండా పోలీసులు వాహనంలోకి నెట్టి స్టేషన్‌కు తరలించారు.



పోలీసులు వందలాది మంది నిరుద్యోగులను అరెస్ట్ చేసి గోషామహల్ స్టేడియానికి తరలించగా అక్కడికి చేరుకొని వారికి మద్దతుగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి, బీసీ జనసభ నేత రాజారాం యాదవ్ తదితరులు



గోషామహల్ స్టేడియంలో బీఆర్ఎస్ నేతలకు తమ సమస్యలు చెబుతున్న ఉద్యోగార్థులు



నిరుద్యోగులకు మద్దతు తెలిపేందుకు టీజీపీఎస్సీ కార్యాలయం వద్దకు వచ్చిన దివంగత సాయిచంద్ భార్య రజినిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు



ముట్టడికి తరలకుండా ఉద్యోగార్థులను కట్టడి చేసేందుకు సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

**• ఏం జరుగుతుందా అని చూస్తున్న!**



'సార్ నేను బైక్ ఆపి ఇక్కడ ఏం జరుగుతున్నదని చూస్తున్నా. ఆ మాత్రానికే అరెస్టు చేస్తారా? నా బైక్ కీ తీసుకున్నారు. అది రోడ్డుమీదుంది. నన్ను వదిలిపెట్టండి' అంటూ వేడుకున్నా పట్టించుకోకుండా పోలీసులు ఓ యువకుడిని అరెస్ట్ చేశారు.

**• నా ఐడీకార్డు చూస్కో..**



బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని అనుమానంతో ఆపి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

**• మెట్రో వద్ద పోలీసులు**



టీజీపీఎస్సీ ముట్టడికి నిరుద్యోగులు వెళ్లకుండా గాంధీభవన్ మెట్రోస్టేషన్ వద్ద మోహరించిన పోలీసులు